నగరాల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక

- జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

శెనార్తి మీడియా, కరీంనగర్

పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, విపత్తులను ఎదుర్కొనే పట్టణ ప్రాంతాల నిర్మాణం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను రూపొందించిందని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు.జూన్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 10 వరకు 100 రోజుల పాటు మున్సిపాలిటీల్లో ప్రజలతో పాటు పారిశుధ్య కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, విద్యార్థులు, స్థానిక సంస్థల సిబ్బందిని భాగస్వాములుగా చేసుకొని పరిశుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.మొదట ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసి, క్యాలెండర్ ప్రకారం కార్యాచరణ కొనసాగిస్తామని, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు కార్యక్రమాలను పత్రికలు, ఇతర మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.వాక్ విత్ కమీషనర్, ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యాచరణకు అవసరమైన ఐఈసీ సామాగ్రి, మౌలిక సదుపాయాలు, నోడల్ అధికారులను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.సీడీఎంఏ అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్టు వెల్లడించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.“ఒక చర్య... ఒక మార్పు” నినాదంతో ప్రజల భాగస్వామ్యంతో "ప్రజలే ముందు" అనే విధానాన్ని అనుసరిస్తూ పట్టణాభివృద్ధి సాధించడమే లక్ష్యమని వివరించారు.ఈ సందర్భంగా మురుగు కాలువల పూడికలు తొలగింపు, ఇంటింటి అవగాహన కార్యక్రమాలు, గ్రీన్ ప్రొటోకాల్, హోం కంపోస్టింగ్, చెత్త వేరు చేయడం, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, డెంగ్యూ, మలేరియా నివారణ, దోమల నియంత్రణ డ్రైవ్, డంపింగ్ యార్డులు సందర్శన, కమ్యూనిటీ సమావేశాలు, పాఠశాలల్లో కంపోస్టింగ్ యూనిట్లు, అవగాహన పర్యటనలు, కార్మికులకు ఆరోగ్య శిబిరాలు, స్వచ్ఛత పోటీలు, ర్యాలీలు, కళాప్రదర్శనలు, వీధివిక్రయదారుల గుంపుల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.అంతేకాక, వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు సందర్శన, వనమహోత్సవం, నీటి కనెక్షన్ల నమోదు, శిథిల భవనాల తొలగింపు, వర్షపు నీటి నిల్వ గుంతల ఏర్పాటు, వీధి కుక్కల జనాభా నియంత్రణ, ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, వలస కుటుంబాలకు సేవల కల్పన, సోషల్ సెక్యూరిటీ లింకేజ్, వ్యాపార లైసెన్సుల సవరింపు వంటి కార్యక్రమాలను కూడా 100

రోజుల కార్యాచరణలో అమలు చేయనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ చేపట్టే ఈ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని, “ఒక మార్పు అభివృద్ధికి మలుపు” తేవాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లకు కమిషనర్ ఆదేశాలు

శెనార్తి మీడియా, కరీంనగర్

కరీంనగర్ నగరపాలక సంస్థలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు ఆదేశించారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ పురస్కారంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.వేడుకల సజావుగా నిర్వహణకు కమిషనర్ దిశా నిర్దేశాలు ఇచ్చి, అధికారులకు సలహాలు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జూన్ 2 వ తేదీన ఘనంగా వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని కూడా హోరాహోరీగా సూచించారు.కళాభారతి భవనానికి చక్కటి లైటింగ్ ఏర్పాటు, జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సుందరీకరణ ఏర్పాట్లు చేయాల్సిందిగా కమిషనర్ తెలిపారు. నగరంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం, జయశంకర్ సార్ విగ్రహం జంక్షన్ల పూలతో అలంకరణ చేయాలని కమిషనర్ ఆదేశించారు.వేడుకల్లో ఎలాంటి లోటు లేకుండా, ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఈఈ సంజీవ్ కుమార్, డీఈలు అయూబ్ ఖాన్, వెంకటేశ్వర్లు, ఏఈలు సతీష్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాన్ని సీజ్ చేసిన అధికారులు

శెనార్తి మీడియా, నిర్మల్ : నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద నిర్వహిస్తున్న తెల్లకల్లు దుకాణంలో మైనర్లకు విక్రయాలు తెల్ల కళ్ళు పాకెట్లను అమ్మడంతో కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీ చేసి నిజమని తేలడంతో దుకాణాలను సీజ్ చేశారు. తెల్లకల్లు దుకాణాల్లో 10 సంవత్సరాలలోపు పిల్లలకు కల్లును విక్రయిం చడం వల్ల వారు చెడిపోతున్నారని కొందరు తల్లిదండ్రులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దుకాణాన్ని సందర్శించి శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

చౌకధరల దుకాణాలు సమయానికి తెరచి ఉంచాలని అధికారులకు ఆదేశం

- ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడతారని హెచ్చరిక
- ఈ-పాస్ మిషన్ పనితీరుపై రేషన్ డీలర్లకు అవగాహన
- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

శెనార్తి మీడియా, మంచిర్యాల

జిల్లాలో అర్హులైన లబ్దిదారులకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, రేషన్ డీలర్లు, ఈ-పాస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.చౌకధరల దుకాణాలు సమయానికి తెరిచి ఉంచాలని, తూకం, నిల్వల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. రేషన్ సన్నబియ్యం అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందేలా కృషి చేయాలని చెప్పారు. ధాన్యం నిల్వల కోసం దుకాణాలలో సరిపడా స్థలం సిద్ధంగా ఉంచాలని, నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం చెల్లించరాదని హెచ్చరించారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తారని, చౌకధరల దుకాణాల సమాచారం నోటిస్ బోర్డుల ద్వారా స్పష్టంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్టాక్ నిర్వహణ, రిజిస్టర్ల సక్రమ నిర్వహణపై డీలర్లను దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ-పాస్ మిషన్ పని తీరును ఇంజనీర్లు రేషన్ డీలర్లకు వివరించారు. కేటాయించిన రేషన్ సన్నబియ్యం అర్హులైన లబ్దిదారులకు సమయానుసారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. అకాల వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా, రాబోయే మూడు నెలల కాలానికి రేషన్ సన్నబియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లు, ఈ-పాస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి "నీటి బిందువు - జలసింధువు" వన మహోత్సవం

- 675 హెక్టార్లలో 40 లక్షల మొక్కల నాటిక..
- 62 మినీ చెరువుల నిర్మాణం, 43 చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి..

శెనార్తి మీడియా, మంచిర్యాల

సింగరేణి సంస్థ జూన్ 1 నుంచి వర్షాకాలం నేపథ్యంలో వన మహోత్సవ కార్యక్రమాలను భారీ ఎత్తున ప్రారంభించనుంది. ఈ సందర్భంగా సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరామ్ ప్రకటన చేశారు. సంస్థ వ్యాప్తంగా 675 హెక్టార్లలో 40 లక్షల మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నీటి బిందువు - జలసింధువు" కార్యక్రమంలో భాగంగా 62 మినీ చెరువుల నిర్మాణాన్ని నిర్ణయించగా, వీటిలో 48 చెరువుల పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులను మరో వారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలు, అటవీ, పర్యావరణ శాఖలతో సమీక్ష నిర్వహించిన ఎన్.బలరామ్, వన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించేందుకు సూచనలు అందజేశారు. మొక్కల నాటికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కార్మికులు, స్థానికులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు.

చెరువుల పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం..

భూగర్భజలాల పెంపుదలకు 105 చెరువుల నిర్మాణం, పూడికతీత పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 43 చెరువుల్లో పూడికతీత పూర్తయిందని తెలిపారు. చెరువుల పనుల్లో నాణ్యతతోపాటు కట్టల బలాన్ని పెంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ పిపి కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.డి.ఎం.సుభాని, అటవీశాఖ సలహాదారులు మోహన్ పరిగేన్, ఇతర అధికారులు, ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

శెనార్తి మీడియా, కరీంనగర్ :

ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన రేండ్ల రాజేశ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు సొసైటీ ఉపాధ్యక్షుడిగా టి.జయహరి, కార్యదర్శిగా టి.స్వరణ్ రాజ్, కోశాదికారిగా జి.ప్రశాంత్ కుమార్, డైరెక్టర్లుగా కె.స్వామి, ఆర్.శ్రీలక్ష్మి. జి.అనురాధ, ఎం.రవీంద్ర కుమార్, ఎం.అరవింద్ గౌడ్, టి.రాజీవ్ చంద్, దుర్గేందర్ బాధ్యతలు చేప ట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ సచివాలయ సంఘం అధ్యక్షుడు గిరి శ్రీని వాసరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.నవీన్ కుమార్ , ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దేవేందర్ తదితరులు రాజేశ్ ను గజమాలతో సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సచివాలయ ఉద్యోగులను కొత్తగా సొసైటీ సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సభ్యత్వ ఫారాలను అందజేశారు. సచివాలయంలోని ప్రతి ఉద్యోగి కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని, తద్వారా సొసైటీ ఆర్థికంగా బలపడి ఉద్యోగులకు సేవలు అందించడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో 271 కోట్లు జమ

శెనార్తి మీడియా, మంచిర్యాల

జిల్లాలో రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన 345 కొనుగోలు కేంద్రాల్లో 320 కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 25,280 మంది రైతుల వద్ద నుంచి 1.77 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, రూ. 271.53 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. లక్ష్యాలు పూర్తి చేసిన 216 కొనుగోలు కేంద్రాలు మూసివేశారని, మిగతా కేంద్రాల్లో కొనుగోలు కొనసాగుతోందని తెలిపారు.ప్రతిరోజు 1,500 మంది సిబ్బంది, హమాలీలు సహకారంతో 4,000 నుంచి 8,000 టన్నుల వరి ధాన్యాన్ని కాంటా చేసి 358 లారీల ద్వారా 198 మిల్లులకు తరలిస్తున్నారు. ప్రతి రోజు రూ. 5 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు.

అహల్యాబాయి హోల్కర్ జయంతి



శెనార్తి మీడియా, కరీంనగర్

బీజేపీ ఈస్ట్, సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో భారత మహారాణి అహల్యబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు శుక్రవారం రోజు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పలువురు ప్రముఖులకు సన్మానాలు చేశారు.ఈ కార్యక్రమానికి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అహల్యబాయి గొప్ప భారత మహారాణి అని కొనియాడారు. ఆమె 30 ఏళ్ల పాలనలో 70 ఏళ్ల జీవితంలో కాశీ నుండి కన్యాకుమారి వరకు 108 శివలింగాలు, 157 ఆలయాలను పునరుద్ధరించారని చెప్పారు. విదేశీయులు ధ్వంసం చేసిన ఆలయాలను తిరిగి నిర్మించి, అనేక సత్రాలను ఏర్పాటు చేయడంలో ఆమె చూపిన త్యాగ సేవా దృక్పథం గురించి వివరించారు.దానధర్మాలను జీవన భాగంగా మలుచుకున్న అహల్యబాయి హోల్కర్ ప్రజల మనస్సుల్లో నిలిచిపోయిన ఏకైక మహారాణి అని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ కన్వీనర్ అవుదుర్తి శ్రీనివాస్, సెంట్రల్ జోన్ కన్వీనర్ తణుకు సాయికృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, జె కుమార్, శ్యామల వెంకటరమణ, ఎర్రోజు రఘు, శ్రీరాములు, సురేష్, సందీప్, నరేందర్, పోరెడ్డి, శ్రీధర్, మునీందర్, శివ సాయి, రవీందర్, పాల్ సింగ్, తేజస్విని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన వన్ టౌన్ ఇన్స్పెక్టర్

శెనార్తి మీడియా, గోదావరిఖని:

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడతానంటూ చిన్న పాపతో బయటకు వెళ్లిన మహిళను గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ తన చొరవతో కాపాడాడు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ రాత్రి 11 గంటల సమయంలో తన కుమార్తెతో ఇంటి నుండి ఎవరికి తెలియకుండా బయటకు వెళ్లింది. గోదావరి బ్రిడ్జి వద్ద ఆత్మహత్య చేసుకుంటానని సమాచారం అందిన కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీసులకు వెళ్లి సమాచారం ఇచ్చారు. ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి వెంటనే స్పందించి ఆమెకు ఫోన్ చేసి ఆత్మహత్యతో ఏ సమస్య కూడా పరిష్కారం కాదని శాంతవచనాలు చెప్పారు. సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని నమ్మ కాన్ని కల్పించారు. ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె లొకేషన్ గుర్తించి అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని చిన్నపాపతో కలిసి పోలీస్ వాహనంలో బట్టీగా తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎరువుల డీలర్లకు కొత్త ఈపీఓఎస్ యంత్రాల పంపిణీ

శెనార్తి మీడియా, మంచిర్యాల :

మంచిర్యాల డివిజన్ లోని ఎరువుల విక్రయ డీలర్లకు కొత్త ఈపీఓఎస్ యంత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం సీతరాంపల్లిలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఈ యంత్రాలను డీలర్లకు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ పీఐసీ ఫెర్టిలైజర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈపీఓఎస్ యంత్రాల ద్వారా ఆధార్ కార్డు, భూమి వివరాలు, పంటల ఆధారంగా రైతులకు ఎరువులు పంపిణీ చేయనున్నారు. ఇది వ్యవహారాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చనుందని అధికారులు పేర్కొన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సరైన ఎరువులు అందించేందుకు ఈపీఓఎస్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు వ్యవసాయ అధికారి కల్పన తెలిపారు. డీలర్లు ఈ విధానానికి సహకరించాలని సూచించారు. డీలర్లకు ఈ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జనారం మండలాలకు చెందిన డీలర్లు హాజరయ్యారు. కొత్త విధానం ద్వారా రైతులు అవసరమైన ఎరువులను సమయానుసారం సులభంగా పొందగలుగుతారని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ అధికారి అనిత, ఎస్ పీఐసీ కంపెనీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.